# పీఎంఏవై కింద తెలంగాణకు
## 20 లక్షల ఇండ్లు మంజూరు చేయండి

### కేంద్ర మంత్రి ఖట్టర్‌కు సీఎం రేవంత్ వినతి




హైదరాబాద్: ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్) 2.0 కింద తెలంగాణకు 20 లక్షల ఇండ్లు మంజూరు చేయాలని కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. దేశ పట్టణ జనాభాలో ఎనిమిది శాతం ప్రజలు తెలంగాణలో ఉన్నారని సీఎం తెలిపారు. పీఏఎంవై (యూ)తోపాటు పట్టణాభివృద్ధి, విద్యుత్ శాఖల పనితీరుపై కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. పీఎంఏవై 2.0లో చేరిన తొలి రాష్ట్రమైన తెలంగాణ ఇళ్ల నిర్మాణానికి సమగ్రమైన డాటా, పూర్తి ప్రణాళికతో సన్నద్ధంగా ఉన్నందున రాష్ట్రానికి 20 లక్షల ఇళ్లు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు.దేశంలోని మహా నగరాలైన ఢిల్లీ, చెన్నై, బెంగళూరుతో పోల్చితే హైదరాబాద్‌లో మెట్రో కనెక్టవిటీ తక్కువగా ఉందని, ఈ నేపథ్యంలో మెట్రో ఫేజ్-2 కింద ఆరు కారిడార్లను గుర్తించామని మనోహర్‌లాల్‌కు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కారిడార్ -4: నాగోల్-శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం (36.8 కి.మీ.), కారిడార్-5: రాయదుర్గం-కోకాపేట నియోపొలిస్ (11.6 కి.మీ.), కారిడార్-6: ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ.), కారిడార్-7: మియాపూర్-పటాన్‌చెరు (13.4 కి.మీ.), కారిడార్-8: ఎల్ బీ నగర్-హయత్ నగర్ (7.1 కి.మీ), కారిడార్- 9: రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం-ఫోర్త్ సిటీ (స్కిల్ యూనివర్సిటీ) (40 కి.మీ.) ఉన్నాయని వివరించారు.మొదటి అయిదు కారిడార్ల (76.4 కిమీ) కోసం డీపీఆర్లు పూర్తయ్యాయని కేంద్ర మంత్రి ఖట్టర్ దృష్టికి సీఎం రేవంత్ రెడ్డి తెచ్చారు. ఈ కారిడార్ల నిర్మాణానికి రూ.24,269 కోట్లు వ్యయమవుతుందన్నారు. డీపీఆర్లు ఆమోదించడంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యం (జేవీ) కింద చేపట్టి నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు.మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు చేయూతనివ్వాలని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మూసీలో మురుగు చేరకుండా నదికి ఇరువైపులా 55 కి.మీ. (మొత్తంగా 110 కి.మీ.) కాలువలు, బాక్స్ డ్రెయిన్లు, ఎస్టీపీల నిర్మాణానికి రూ.10 వేల కోట్లు కేటాయించాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగరంతోపాటు సమీపంలోని 27 పట్టణ పాలక సంస్థల పరిధిలో మురుగు నీటి నెట్‌వర్క్ నిర్మాణానికి రూ.17,212 కోట్లతో సమగ్ర మురుగునీటి మేజర్ ప్లాన్ (సీఎస్‌ఎంపీ) తయారు చేశామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.అమృత్ 2.0 లేదా ప్రత్యేక ప్రాజెక్టుగా సీఎస్‌ఎంపీని గుర్తించి నిధులు సమకూర్చాలని కేంద్ర మంత్రి ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో రెండో పెద్ద నగరమైన వరంగల్ సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మాస్టర్ ప్లాన్‌ను నోటిఫై చేసిందని సీఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు. వరంగల్‌లో రూ.41,70 కోట్లతో సమగ్ర భూగర్భ నీటి పారుదల (యూజీడీ) పథకాన్ని చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు.

# కామన్ సెన్స్ ఉందా..?
## మహిళా కలెక్టర్‌పై నోరు పారేసుకున్న
## మంత్రి పొంగులేటి



కరీంనగర్ : రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కరీంనగర్ కలెక్టర్ పట్ల రుసరుసలాడారు. మహిళా కలెక్టర్ అని కూడా చూడకుండా.. ఆమెను కేంద్ర మంత్రుల ముందు అవమానించేలా మాట్లాడారు. కామన్ సెన్స్ ఉందా లేదా అంటూ కలెక్టర్ పమేలా సత్పతిపై నోరు పారేసుకున్నారు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. దీంతో కలెక్టర్ అవమానంగా ఫీలై, కార్యక్రమం ముగిసే వరకూ ముభావంగా ఉన్నారు.కరీంనగర్‌లో కేంద్ర పట్టణాభివృద్ధి, విద్యుత్, గృహ నిర్మాణ శాఖ మంత్రి మనోహర్ లాల్ కట్టర్, హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ శుక్రవారం ఉదయం పర్యటించారు. ఈ పర్యటనలో మంత్రి పొంగులేటి.. కలెక్టర్ పమేలా సత్పతిపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వాట్ ఆర్ యూ డూయింగ్.. వాట్ ఈజ్ దిస్ నాన్ సెన్స్ అంటూ తీవ్రంగా ఆగ్రహించారు. అసలు కామన్ సెన్స్ ఉందా..? అని కలెక్టర్ ముఖం చూస్తూ సీరియస్ అయ్యారు. ఎస్పీ ఎక్కడ అంటూ ప్రశ్నించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కలగజేసుకుని.. కనీసం ఏసీపీ కూడా లేరని అన్నారు. కలెక్టర్‌పై పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నోరు పారేసుకున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# రెండో ఇన్నింగ్స్‌లోనూ నిరాశే
## 28 రన్స్‌కే రోహిత్ శర్మ ఔట్



ముంబై: జమ్మూకశ్మీర్‌తో జరుగుతున్న రంజీ మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో రోహిత్ శర్మ 28 రన్స్ చేసి ఔటయ్యాడు. కొన్ని ట్రేడ్‌మార్క్ షాట్లు కొట్టినట్లు కనిపించినా.. ఎక్కువ సేపు క్రీజ్‌లో నిలువలేకపోయాడు. భారీ ఇన్నింగ్స్ ఆడుతాడని ఆశించినా.. రోహిత్ తన వికెట్‌ను చేజార్చుకున్నాడు. ఇటీవల ఆస్ట్రేలియాతో ముగిసిన టెస్టు సిరీస్‌లో పేలవంగా ఆడిన రోహిత్ ఇంకా ఆ లోటు నుంచి కోలుకోలేదు. తొలి ఇన్నింగ్స్‌లో 19 బంతుల్లో 3 రన్స్ మాత్రమే చేసి రోహిత్ ఔటయ్యాడు.అయితే రెండో ఇన్నింగ్స్‌లో ఓ అర్ధశతకాన్ని బాదుతాడేమో అని భావించినా.. ఆ మైలురాయిని అందుకోలేకపోయాడు. ఉమర్ నాజిర్ బౌలింగ్‌లో సిక్సర్.. నబీ, యుధ్‌విర్ బౌలింగ్‌లో కొన్ని బౌండరీలు సాధించినా.. భారీ ఇన్నింగ్స్ ఆడలేకపోయాడు. దాదాపు దశాబ్ద కాలం తర్వాత రోహిత్ .. దేశవాళీ క్రికెట్‌లో ఆడుతున్నారు. నిజానికి రెండో ఇన్నింగ్స్ నాలుగో ఓవర్‌లోనే రోహిత్ ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు.రోహిత్ ఇచ్చిన రిటర్న్ క్యాచ్ బౌలర్ నజీర్ డ్రాప్ చేశాడు. ఒక్క రన్ వద్ద డ్రాప్ చేసినా.. 11 బంతుల్లో రోహిత్ 21 రన్స్ చేశాడు. ఆ తర్వాత జాగ్రత్తగా ఆడే ప్రయత్నం చేశాడు. కానీ మధ్య మధ్యలో బంతి బీట్ అవుతూనే ఉన్నాడు. రోహిత్ ఇన్నింగ్స్‌లో మూడు సిక్సర్లు, రెండు ఫోర్లు ఉన్నాయి. తాజా సమాచారం ప్రకారం ముంబై తన రెండో ఇన్నింగ్స్‌లో 22 ఓవర్లకు 5 వికెట్లు కోల్పోయి 86 రన్స్ చేసింది.

# కూలిన అంగన్‌వాడీ సెంటర్ పైకప్పు

● నలుగురు పిల్లలకు గాయాలు



సంగారెడ్డి : అభం శుభం తెలియని చిన్నారులు చదువుకునే అంగన్‌వాడీ సెంటర్‌లో ప్రమాదం చోటు చేసుకుంది. పైకప్పు పాక్షికంగా కూలింది. ఈ శిథిలాలు మీద పడడంతో నలుగురు పిల్లలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్ మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది.గాయపడ్డ చిన్నారులను చికిత్స నిమిత్తం నారాయణఖేడ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆ పిల్లల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇక అంగన్‌వాడీ సెంటర్‌లో ఉన్న మిగతా పిల్లలను వారి నివాసాలకు పంపించారు. ఈ ఘటనపై మండల అధికారులు ఆరా తీశారు.

## కేసీఆర్‌ను కలిసిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



హైదరాబాద్:బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర కలిశారు.తన పుట్టినరోజు సందర్భంగా ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజుకు కేసీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆశీర్వదించారు.

PUBLISHED,OWNED BY BANDARI MARUTHI ON BEHALF OF SRK MEDIA 8-1-401/1, KATTARAMPUR, KARIMNAGAR, TELANGANA,9618181112: EDITOR-IN CHIEF: MANASANI KRISHNA REDDY